


నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

22 ఆదివారం నవంబర్ 2026 పేజీలు: 3

భర్త బ్రతికుండగానే ఒంటరి మహిళ పింఛన్ పొందిన మహిళ..

- **గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శి ఇద్దరు లంచం తీసుకొని పింఛన్ మంజూరు చేశారా..?**
- **ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పంపిణి**





సత్య నిష్ఠ, మిర్యాలగూడ, నవంబర్ 21: తేట్టకుంట గ్రామపంచాయతీ సర్పంచ్ మరియు పంచాయతీ కార్యదర్శి ఇద్దరు కలిసి లంచం తీసుకొని ఒంటరి మహిళ పింఛన్లు పెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోందని తేట్టకుంట గ్రామ నాయకులు ఈరోజు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తూ ఆరోపించారు.ధరావత్ కవిత భర్త పేరు జవహర్ లాల్. వీరికి సుమారు 10 ఎకరాల భూమి, కిరాణం షాపు, రెండు ఇండ్లు, నాలుగు షట్టర్లు ఉన్నాయి. వారు ఒంటరి మహిళా పింఛన్‌కు అనర్హులాలు. అయినా డబ్బుకు ఆశపడిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వారికి ఒంటరి మహిళా పింఛన్ పెట్టించారని వారు ఆరోపించారు.ఇదే సర్పంచ్ గతంలో రేషన్ బియ్యం అమ్ముకున్న విషయం అందరికీ తెలిసిందేనని, స్వయంగా గ్రామస్తులే అతన్ని పట్టుకుని వాడపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారని గుర్తుచేశారు.ఎన్ని ఆధారాలు ఉన్నా ఆర్డీవో మరియు సివిల్ సప్లై అధికారులు, ప్రజా ప్రతినిధులైన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మరియు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కూడా పట్టించుకోవడం లేదని, అధికార పార్టీ సర్పంచ్ కాబట్టే ఇలా జరుగుతోందని వారు విమర్శించారు.ఇకనైనా ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు కళ్లు తెరిచి ఇలాంటి వ్యక్తులపై చర్య తీసుకోవాలని, సర్పంచ్‌పై వేటు వేసి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ కాట్రాజు సోమయ్య నాయుడు, వార్డు సభ్యులు సైదయ్య, వెంకన్న, గ్రామ నాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప కరుణా కటాక్షంతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

- **మనుమడి పుట్టినరోజు వేళ దాతృత్వం**
- **తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు**
- **పూర్ణాంశ్ పుట్టిన రోజు అన్నదానానికి 50 వేల సహాయం**



కోదాడ – నవంబర్ 21 (సత్యనిష్ఠ) అయ్యప్ప స్వామి కరుణా, కటాక్షాలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు ఆకాంక్షించారు. కోదాడ పట్టణం లోని బాలాజీ నగర్‌లో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మాలధారులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు ఘనంగా జరుగు తున్నాయి. ఈ క్రమంలో శనివారం రామినేని శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతుల మనుమడు పూర్ణాంశ్ పుట్టిన రోజును పురస్కరించు కుని ఆలయం లోని అన్నదాన కార్యక్రమానికి 50,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాము లు చేపడుతున్న 41 రోజుల మండల దీక్ష విజయ వంతంగా పూర్తి కావాలని కోరారు. తమ మనుమడు పూర్ణాంశ్ పుట్టిన రోజు వేళ అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వ హించడంలో పాలు పంచు కోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భగవంతుని సేవలో చేపట్టే ఎలాంటి కార్యక్రమాల కైనా తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతలు రామినేని శ్రీనివాసరావు, శ్రీదేవి, పెరుమళ్ల సూర్య కృష్ణ, అనూష, తండ్రి నరసింహా రావు, తల్లి నిర్మలదేవి, బండారు వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం, హైమావతి, వెంకట రమణ, శ్రీ గౌరీ లను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల పింఛన్ల విషయంలో అవకతవకలు

- **అర్హులైన గౌడ కులస్తులకే పింఛన్లు, లైసెన్సులు ఇవ్వాలి**
- **యమ్ పి డి ఓ కు వినతిపత్రం అందజేత**



సత్యనిష్ఠ -గరిడేపల్లి : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పింఛన్ల మంజూరు ప్రక్రియలో పొనుగోడు గ్రామంలో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని సూర్యాపేట జిల్లా సర్దార్ సర్వాయి పాపన్న సేన నాయకులు పలువురు ఆరోపించారు. అర్హులైన వారికీ న్యాయం చేసి అనర్హులపై చర్యలు తీసుకోవాలి అని యమ్‌పిడిఓకు శనివారం వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులుపలువురు మాట్లడుతూ మండలంలోని కొన్ని గ్రామాల్లో గౌడ కులస్తులకు సంబంధించిన పింఛన్లను ఇతర కులాలకు చెందిన వ్యక్తులకు మంజూరు చేయడం ఎలా జరిగిందని, ఇందుకు ఏ విధమైన కుల ధ్రువీకరణ పత్రాలు ప్రాతిపదికగా తీసుకున్నారని ఎంపీడీవోను ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ, ఈ పింఛన్ల మంజూరులో తమ శాఖ నేరుగా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని, ఎక్సైజ్ శాఖ జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాలు, లైసెన్సులను పరిగణనలోకి తీసుకొని పింఛన్ల మంజూరు చేసినట్లు తెలిపారు. దీనిపై సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదించి నివేదిక తీసుకోవాలని సూచించినట్లు నాయకులు వెల్లడించారు.

ఈ సందర్భంగా గౌడ కులస్తులకు అన్యాయం జరగకుండా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు విచారణ చేపట్టి, అర్హులైన గౌడ కులస్తులకు మాత్రమే నిబంధనల ప్రకారం లైసెన్సులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర కులాలకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు లేదా నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సులు జారీ చేసినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా సర్దార్ సర్వాయి పాపన్న సేన అధ్యక్షుడు అనంతు గురవయ్య గౌడ్, కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, రావుల ఆంజనేయులు గౌడ్, నర్సింగ్ నాగ సైదులు గౌడ్, బొల్లెపల్లి శ్రీనివాస్ గౌడ్, నర్సింగ్ వినయ్ గౌడ్, కారింగుల గురుస్వామి గౌడ్ తదితర గౌడ సోదరులు పాల్గొన్నారు.

రంగుండ్ల తండలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన సమావేశం



తిరుమలగిరి సాగర్, సత్యనిష్ఠ: రంగుండ్ల తండ గ్రామపంచాయతీలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అంగోతు గోపాల్ నాయక్ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా, అర్హులైన కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలు, ఆధార్, బ్యాంకు ఖాతా, నామినీ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పథకంపై గ్రామ ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందేలా గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి మధు, ఉపసర్పంచ్ బంగారి మనయా నాయక్, వార్డు సభ్యులు లక్ష్మీ, శ్రీను నాయక్, దీపా నాయక్, గ్యమా, లచ్చంపతి, భాను, నాగు తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవరకొండలో వివాహానికి హాజరైన డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత



దేవరకొండ, నవంబర్ 21, సత్య నిష్ఠ: దేవరకొండ పట్టణంలోని శివ సాయి గార్డెన్స్ లో క్లాస్ మేట్ రెహానా బేగం కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నల్గొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత.

కూనవరం పీహెచ్‌సీలో ఏబీ ఫౌండేషన్ సేవా కార్యక్రమం

- రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ
- నిరుపేదలకు అండగా ఏబీ ఫౌండేషన్ -- చైర్మన్ కుంజ అనిల్



కూనవరం-సత్యనిష్ఠ:పోలవరం జిల్లా కూనవరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీలో ఏబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఫౌండేషన్ సభ్యులు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏబీ ఫౌండేషన్ చైర్మన్ కుంజ అనిల్ మాట్లాడుతూ.. నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా నిలవడమే ఏబీ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి శనివారం ఏదో ఒక రూపంలో, ఎక్కడో ఒకచోట పేదలకు సహాయం చేస్తూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి సహాయం చేయాలనే సంకల్పంతో ఫౌండేషన్ ముందుకు సాగుతోందని, నిరుపేదలకు చేయూతనివ్వాలనే ఆలోచన ఉన్నవారు ఏబీ ఫౌండేషన్‌కు తమ వంతు సహకారం అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కె. కిరణ్ బాబు, టి. వినోద్, జల్లారపు రాము, కూనవరం పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాడాలి: దాసర్ల దుర్గమ్మ

- **గ్రామ గ్రామాన మహిళా సమైక్య కమిటీలు ఏర్పాటు: ధనవత్ శాంత.**



సత్యనిష్ఠ, దామరచర్ల, నవంబర్ 21:నేటి సమాజంలో నిత్యం మహిళలపై అఘాహిత్యా లు, అత్యాచారాలు మహిళలను ఆటబొమ్మ గా చూపిస్తున్నారని మహిళా సమైక్య నియోజ కవర్గ అధ్యక్షురాలు దాసర్ల దుర్గమ్మ,ధనావత్ శాంత వాపోయారు. శనివారం మండలంలోని బొత్తలపాలెం గ్రామంలోని మండల మహిళా సమితి నియోజకవర్గ నాయకురాలు మమత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిపిఐ మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సమితి నాయకురాలు దాసర్ల దుర్గమ్మ, ధనవత్ శాంత మాట్లాడుతూ.. మహిళలు గృహానికి పరిమితం కావద్దని సమాజంలో కోర్చి చైతన్యం కావాలని ప్రశ్నించే అలవాటును అలవర్చుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఆర్థికంగా,సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ఉన్నత విద్యను అభ్యసించి చైతన్యవంతులు కావాలని కోరారు. గ్రామాలలో నిత్యం మహిళలపై గృహింసలు అసభ్యకరమైన పదజాలం వాడటం వల్ల స్త్రీలు ఆత్మనున్యత లోనవుతున్నారన్నారు. అందుకే ప్రతి స్త్రీ చైతన్యవంతమైన సమాజంలోకి రావాలని స్త్రీలు, పురుషులు సమానమని తెలుసుకొని నడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎస్కే షమీం, పేరుపొంగు సరోజ, కనక రత్నం, ఏసమ్మ సువార్త, పోలేపల్లి రాణి, సైదమ్మ, లలిత, గురువమ్మ, సోమమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుడిపల్లిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



గుడిపల్లి, నవంబర్ 21, సత్యనిష్ఠ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని గుడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖరరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకం ద్వారా రూ. 5 లక్షల ఉచిత జీవిత బీమా సౌకర్యాన్ని అందిస్తోందని తెలిపారు. గ్రామానికి చెందిన అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత గడువులోగా తమ ఆధార్, రేషన్ కార్డు మరియు నామినీ వివరాలతో పంచాయతీ కార్యాలయంలో తప్పనిసరిగా బీమా నమోదు చేసుకోవాలని గ్రామ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గుడిపల్లి తహసీల్దార్ సుహాసిని, గుడిపల్లి మండల విద్యా అధికారి శ్రీనయ్య, ఉప సర్పంచ్ శ్రీనయ్య, పంచాయతీ కార్యదర్శి విజయ్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడిని ఖండించిన సంకు ధనలక్ష్మిబాధితురాలిని పరామర్శించి ఆర్థిక సాయం

న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని హామీ



నల్లగొండ, నవంబర్ 21, సత్య నిష్ఠ: నల్లగొండ పట్టణంలో పారిశుద్ధ్య కార్మికురాలిపై జరిగిన దాడి ఘటనను జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సంకు ధనలక్ష్మి, పాదం అనిల్ కుమార్ తీవ్రంగా ఖండించారు. దాడికి గురైన కార్మికురాలిని పరామర్శించి, ఆమెకు తమ సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు. బాధితురాలికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటూ, న్యాయం కోసం నిరంతరం పోరాటం చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధితురాలికి కొంత ఆర్థిక సహాయాన్ని అందజేసి, ఆమెకు ధైర్యం చెప్పారు.

శరత్ కుమార్ మృతికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలి: కుంజా శ్రీను డిమాండ్



ఎటపాక, సత్య నిష్ఠ: భద్రాచలం సత్యసాయి లాడ్జి వద్ద నవంబర్ 16 రాత్రి జరిగిన దాడిలో మృతి చెందిన ఆదివాసి యువకుడు తెల్లం శరత్ కుమార్ (22) హత్య ఘటనపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను, భద్రాచలం డివిజన్ అధ్యక్షులు సొందె మల్లుదొర చేసిన ఫిర్యాదును జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్టీ) స్వీకరించి 83039/ఐఎన్/2026 డైరీ నంబర్‌తో కేసు నమోదు చేసింది.అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామానికి చెందిన తెల్లం రవి కుమారుడు శరత్ కుమార్ భద్రాచలంలో ఫుడ్ డెలివరీ రైడర్‌గా పనిచేస్తున్నాడు. షెడ్యూల్ ఏరియాలో అక్రమ లాడ్జీలు, గుండాల ఆగడాలను ఉపేక్షించకూడదని, తెలంగాణ డీజీపీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు ఇచ్చి నివేదికలు కోరాలని, బాధ్యులను అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ (పీఓఏ), బీఎన్ఎస్ కింద కేసులు నమోదు చేసి, అనధికార లాడ్జీలను సీజ్ చేసి బాధిత కుటుంబానికి ఎక్స్-గ్రేషియా అందించాలని కుంజా శ్రీను, సొందె మల్లుదొర డిమాండ్ చేశారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతవత్ భీల్యా నాయక్

దేవరకొండ, నవంబర్ 21, సత్యనిష్ఠ: దేవరకొండ మండలంలోని చింతబావి గ్రామానికి చెందిన నీలం అంజయ్య యాదవ్-ఎల్లమ్మ కుమారుడు నీలం హరీష్ యాదవ్ - జ్యోతిల వివాహ వేడుకలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతవత్ భీల్యా నాయక్ పాల్గొన్నారు. ఈ సంతోష సమయంలో నూతన వధూవరులను ఆప్యాయంగా పలకరించి, వారిని ఆశీర్వదించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన వైవాహిక జీవితంలోకి అడుగు పెడుతున్న దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భీల్యా నాయక్ వెంట నాయకులు శ్రీశైలం యాదవ్, ముత్యాల చంద్రశేఖర్ యాదవ్, ముదిగొండ సంజీవ, సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, హరిలాల్ నాయక్, కడారి యాదగిరి, కొండల్, కృష్ణయ్య, సుందర్, వీరయ్య, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆశీస్సులు, దీవెనలు నా కుమార్తెకు తోడుగా ఉండాలి

- **తన కుమార్తె సాదియా మెహక్ జన్మ దినాన్ని సమాజ సేవకు అంకితం..**
- **ఫౌండేషన్ అధినేత, లయన్ డా. మునిర్‌అహ్మద్ షరీఫ్..**





సత్యనిష్ఠ, మిర్యాలగూడ, నవంబర్ 21: సాధారణంగా పిల్లల పుట్టినరోజు వచ్చిందంటే కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల మధ్య కేక్ కటింగ్‌లు, వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. కానీ తన కుమార్తె జన్మదినాన్ని సమాజ సేవకు అంకితం చేస్తూ, నిరుపేదలు, వృద్ధులు, నిస్సహాయుల ఆశీస్సులే తన కుమార్తెకు నిజమైన సంపదగా భావిస్తున్న వ్యక్తి జనయేత్రీ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు, లయన్ డా. మునిర్ అహ్మద్ షరీఫ్. తన కుమార్తె సాదియా మెహక్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల వెంట ఉండే సహాయకులకు అల్పాహారం పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగుల సహాయకులకు అల్పాహారం అందించే సేవా కార్యక్రమంలో భాగంగా, సాదియా మెహక్ జన్మదినం సందర్భంగా డా. మునిర్ అహ్మద్ షరీఫ్ ప్రత్యేకంగా అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రిలో రోగుల సేవలో ఉంటూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి సహాయకులకు అల్పాహారం అందించారు. ఆవంతీపురంలోని ప్రభుత్వ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు పండ్ల పంపిణీ మరియు పరీక్ష సామగ్రి అందించారు. జన విజ్ఞాన వేదిక ద్వారా విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు.పుట్టినరోజు కానుకగా సేవా సంస్థ.. ఆశీస్సులే అసలైన బహుమతిడా. మునిర్ అహ్మద్ షరీఫ్ సేవా ఆలోచన వెనుక ఒక ప్రత్యేకమైన భావోద్వేగం ఉంది. తన కుమార్తె జన్మదినాన్ని కేవలం కుటుంబ వేడుకగా కాకుండా, సమాజానికి ఉపయోగపడే రోజుగా మార్చాలనే సంకల్పంతో జనయేత్రీ ఫౌండేషన్ సేవా ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. తన కుమార్తెకు ఆస్తిపాస్తులు, విలువైన బహుమతులు ఇవ్వడం కంటే సమాజంలోని వృద్ధులు, నిరుపేదలు, అనాథలు, నిస్సహాయుల ఆశీస్సులు, దీవెనలు జీవితాంతం ఉండాలన్నదే ఆయన ఆకాంక్ష. ఒక చిన్నారి పుట్టినరోజు సందర్భంగా ప్రారంభమైన ఈ సేవా ఆలోచన నేడు ఐదేళ్ల సుదీర్ఘ సేవా ప్రస్థానంగా ఎదిగి, ఆరో సంవత్సరంలోకి అడుగుపెట్టడం విశేషం. కులమతాలకు అతీతంగా పేదలకు వైద్య సహాయం, ఆర్థిక సహకారం, రక్తదానం, ఆకలితో ఉన్నవారికి ఆహారం, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం వంటి అనేక సేవా కార్యక్రమాలను జనయేత్రీ ఫౌండేషన్ నిర్వహిస్తోంది. డా. మునిర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ.. నా కుమార్తె సాదియా మెహక్ పుట్టినరోజున పేదలకు, నిస్సహాయులకు ఏదైనా చేయగలిగితే అదే నాకు నిజమైన ఆనందం. మా అమ్మాయి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని, మంచి మనసుతో ఇతరులకు సహాయం చేసే వ్యక్తిగా ఉండాలని కోరుకుంటున్నాను. వృద్ధులు, అనాథలు, నిరుపేదలు మనస్ఫూర్తిగా అందించే ఆశీస్సుల కంటే గొప్ప జన్మదిన కానుక మరొకటి ఉండదు. అందుకే ప్రతి జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలని నిర్ణయించుకున్నాను. జనయేత్రీ ఫౌండేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలలో ఫౌండేషన్ సభ్యులు వివిధ సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది. వారందరికీ పేరు పేరున ధన్యవాదాలు అని తెలిపారు. ఫౌండేషన్ ఐదేళ్ల ప్రయాణానికి సహకరిస్తున్న లయన్స్ క్లబ్, ఫౌండేషన్ సభ్యులు, దాతలు, మిత్రులు, శ్రేయోభిలాషులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కుమార్తె పుట్టినరోజున వందలాది మందికి ఆనందాన్ని పంచడం, తన సంతోషాన్ని ఇతరుల సంతోషంలో వెతుక్కోవడం ఇదే డా. మునిర్ సేవా తత్వానికి నిదర్శనం.

మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిల సహకారంతో కోదాడ మార్కెట్ అభివృద్ధి

- **వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్**
- **దళారుల వ్యవస్థకి స్వస్తి... వ్యాపారస్తులకు మేలు...**



కోదాడ - నవంబర్ 21 (సత్యనిష్ఠ) తెలంగాణ తెలంగాణ రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిల సలహాలు సూచన, సహకారం, పాలకవర్గ సభ్యుల తో కలిసి కోదాడ వ్యవసాయ మార్కెట్, సంతని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తున్నట్లు కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరపతమ్మ సుధీర్ ఉన్నారు. శుక్రవారం మునగాల మండలం బరాకత్ గూడెంలో, కోదాడ పరిధి లోని చిమిర్యాల, బాలాజీ నగర్లో వ్యవసాయ మార్కెట్ కు సంబంధించిన చెక్ పోస్టు ను తనిఖీ చేశారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ నియోజక వర్గం నుండి ధాన్యం కొనుగోలు చేసి లారీల పైన వెళ్లే వాహన దారులు చిమిర్యాల, బాలాజీ నగర్, బరాకత్ గూడెం దగ్గర ఏర్పాటు చేసిన మార్కెట్ చెక్ పోస్ట్ ల వద్ద చెస్ కట్టి మార్కెట్ అభివృద్ధికిసహకరించాలని కోరారు. కోదాడ మార్కెట్ లో శనివారం, ఆదివారం గొర్లు, మేకలు, పశువుల సంత కు వచ్చి పోయే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మంత్రి, ఎమ్మెల్యేల సలహాలు, సూచనలతో తాగునీరు పరిశుభ్రత మౌలిక సదుపాయాలు కల్పించి ప్రశాంతంగా వాతావరణంలో రైతులు, వ్యాపారస్తులు వచ్చి వ్యాపారాలు చేసు కునే విధంగా కఠినమైన నిర్ణయాలు తీసుకున్నామని దళారుల వ్యవస్థకు స్వస్తి పలికి వ్యాపారస్తులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసు కుంటున్నామని అన్నారు. గతంలో సంతలో దళారుల వ్యవస్థ ఉండేదని ఇప్పుడు సంతలో దళారుల వ్యవస్థ లేకుండా నేరుగా కొనుగోలు దారుడు, అమ్మకం దారుడు వచ్చి సజావుగా వ్యాపారాలు నిర్వహించు కునే విధంగా పాలక వర్గ సభ్యులతో కలిసి చర్యలు తీసు కుంటున్నామని ఆన్నారు. కార్యక్రమ నిర్వ హణలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

నల్గొండ మున్సిపల్ కార్మికురాలు పైన జరిగిన దాడిని ఖండించండి

- **సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ**



కోదాడ నవంబర్ 21 (సత్యనిష్ఠ) నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికురాలు చందుపట్ల రమణ పై జరిగిన దాడిని ఖండిస్తూ సిఐటియు యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈరోజు తెల్లవారు జామున ఐదు గంటలకు కోదాడ మున్సిపాలిటి కార్మికులు పాత మున్సిపాలిటీ నుండి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ, అనంతరం నిరసన తెలియ జేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకట్ నారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు అను నిత్యం ప్రజల కోసం ఎండనక, వాననక శ్రమ కోర్చి పని చేస్తూ పట్టణాలను జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు రావడంలో వారు చేస్తున్న శ్రమ వెలకట్ట లేనిదని వారు జరిగిన సంఘటనకు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కార్మికులను కొంత మంది వ్యక్తులు ఏ కారణం లేకుండా కొట్టడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండిస్తుందని, చందుపట్ల రమణను కొట్టిన బాలకృష్ణ అనే వ్యక్తిని తక్షణం అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, ఆమెకు తగు న్యాయం చేయాలని లేనట్లయితే సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక ఉద్యమాలను బలోపేతం చేస్తామని వారన్నారు. ఇలాంటి విషయాలు మరల ఎక్కడ జరగ కుండా ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని వారన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో సిఐటియు కోదాడ పట్టణ కన్వీనర్ ఎం ముత్యాలు, యూనియన్ అధ్యక్షులు కొమ్ము నాగేశ్వర రావు, మాతంగి నాగమణి, బెనర్జీ, దేవిక, దావణం, ముత్యాలమ్మ, కాంతమ్మ, వై వెంకటేశ్వర్లు, కమలమ్మ, భద్రమ్మ, రేణుక, తదితరులు పాల్గొన్నారు.